**1-81**

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తన భగవన్నామ సంకీర్తన. సాధారణంగా ఇటువంటి కీర్తనలలో అన్నీ తెలిసిన మాటలే వుంటాయి. దీని భావామృతం చాలా తేలిక. అసలు అక్కరలేదు అనుకోవద్దు. "నెట్టిన గతి" అని ఒక మాట ఈ కీర్తనలో వుంది. అదేమిటో తెలుసుకోవాలంటే నిఘంటువు తెరవక తప్పలేదు నాకు. అందుకే.... దిగితే గాని లోతు తెలీదన్నారు పెద్దలు. ఇంతకీ ఈ కీర్తననెందుకు ఎన్నుకొన్నానంటే... అంతా ఆ శ్రీ హరే అని ప్రహ్లాదుడు చెప్పినదానినే ఇలా అమృతపు జల్లులా కురిపించారన్నమయ్య.

**కం॥ అంతయు నీవే నాకిక**
**చెంతను నీవుండుమంచు శ్రీనామంబుల్**
**ఎంతో సులువుగ ఆ శ్రీ**
**కాంతునకా అన్నమయ్య గానము జేసెన్.**

**రాగం : హిందోళం**

అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంతనాకు నీవే శ్రీ రఘురామా ॥అంతయు॥

కులమును నీవే గోవిందడా, నా-
కలిమియు నీవే కరుణానిధీ
తలపును నీవే ధరణీధరా, నా-
నెలవును నీవే నీరజనాభా ॥అంతయు॥

తనువును నీవే దామోదరా, నా-
మనికియు నీవే మధుసూదనా
వినికియు నీవే విఠలుడా, నా-
వెనుక ముందు నీవే విష్ణుదేవుడా ॥అంతయు॥



Scanned with CamScanner

పుట్టుగు నీవే పురుషోత్తమా, కొన
నట్టనడుమ నీవే నారాయణా
యిట్టె శ్రీ వేంకటేశ్వరుడా నాకు
నెట్టన గతి ఇంక నీవే నీవే

॥అంతయు॥

## భావామృతం

ఓ శ్రీ హరీ! పుండరీకాక్షా (పద్మనయనా) నాకు అంతానీవే. ఇంకొకటి లేదు. రఘుకులసోమా! శ్రీ రామా! సదా నాసమీపంలో వుండేవాడవు నీవే తండ్రీ!

ఓ గోవిందా! నా కులం అంటూ వేరే ఏమీ లేదు అది నీవే. నా సంపద కూడ నీవే. భూరమణా! నా ఆలోచనకూడ నీవే. ఇక నాస్థానమంటూ ఏదన్నావుంటే ఓపద్మనాభా! అది నీవే ప్రభూ!

ఓ దామోదరా! నా శరీరం వేరెవ్వరిదీ కాదు అది నీస్వంతము. మధుసూదనా! నా జీవితం కూడ నీవే. విఠలదేవుడని కీర్తించబడే పాండురంగా నాలోని వినికిడి శక్తి వేరెవెరు? నీవే కదా! నీవు నాకు కనుపించనంత మాత్రాన నాకు నష్టమేముంది సదా నావెనుక ముందట వుండి నన్ను రక్షిస్తున్నది నీవే కదా! విష్ణుదేవా!

ఓ పురుషోత్తమా! నా పుట్టుక ఎలా సంభవించింది నాకు తెలియదా? నీ వల్లనే ప్రభూ! నారాయణుడు అని కీర్తించబడే నీవే చివరలలోను మధ్యలోను వున్నావు. (పుట్టుక నుండి చావు వరకు మాత్రమే కాక మధ్మ జీవితమంతా నీవలననే నడుచుచున్నది) ఓ శ్రీ వేంకటేశ్వరా! నాకు ఇట్టే (సులభసాధ్యుడవు) నీవే వున్నావు. తప్పనిసరియైన గతి ఇంకా నాకెవ్వరున్నారు తండ్రీ! నీవే.....నీవే.....నీవే.



Scanned with CamScanner

(2) 21.5.2020



4-1

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఈ సుప్రసిద్ధమైన కీర్తనలో తమకు చిన్ననాటినుంచే వేంకటేశ్వరుని మంత్రం పెన్నిధిగా మిగిలిందనీ, లోకంలోని మంత్రాలన్నీ ఆ మంత్రంలోనే 'ఆవహించి' వున్నాయని నమ్మకంగా చెబుతున్నారు. ఆదిలో నారదముని మొదలుకొని కృతయుగపు ప్రహ్లాదుడు, త్రేతాయుగపు విభీషణుడు, ద్వాపరయుగపు అర్జునుడు, పురాణకాలంలో ధ్రువుడు, శుకమహర్షి - అందరూ నమ్మినది ఇందిరావల్లభుడైన శ్రీహరినే. పరబ్రహ్మయైన ఆయనే రకరకాల మంత్రాలవల్ల ఆరాధించబడ్డ తిరుమలనాథుడు.

**ఉ॥ మంత్రములన్నియున్ నిలిచి మానవులార! తమావహించెనీ**
**మంత్రము, వెన్నతో కలిగె మాకది భాగ్యము అన్నమయ్యనెన్**
**మంత్రము వేంకటేశునిది మానక తానటు యెంచినాననెన్**
**మంత్రములన్యులేవి తము మన్నన నెంచిరి లెక్కజెప్పెరా.**

**రాగం : అమృతవర్షిణి**

అన్ని మంత్రములు ఇందే ఆవహించెను
వెన్నతో నాకు కలిగె వేంకటేశు మంత్రము ॥అన్ని॥

నారదుడు జపియించె నారాయణ మంత్రము
చేరి ప్రహ్లాదుడు నారసింహ మంత్రము
కోరి విభీషణుడు చేకొనె రామమంత్రము
వేరె నాకు కలిగె వేంకటేశు మంత్రము ॥అన్ని॥

రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుడు జపియించె
అంగవించె కృష్ణమంత్రము అర్జునుడు
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుడు పఠించె
వింగడమై నాకు నబ్బె వేంకటేశు మంత్రము ॥అని॥



Scanned with CamScanner

ఇన్ని మంత్రములకెల్ల ఇందిరానాథుడే గురి
పన్నిన దిదియే పరబ్రహ్మ మంత్రము
నన్ను కావగలిగే పో నాకు గురుడియ్యగాను
వెన్నెల వంటిది శ్రీవేంకటేశు మంత్రము ॥అన్ని॥

**భావామృతం :**

ఓ మానవులారా! లోకాలన్నింటిలోను వున్న మంత్రములన్నింటికీ శ్రేష్ఠమైన మంత్రం ఇందులోనే ఆవహించియున్నది. ఇదే శ్రీవేంకటేశ్వరుని దివ్యమంత్రము. ఇది నాకు వెన్నతో కలిగింది (చిన్నప్పుడు అమ్మ వెన్న తినిపించిన వయసునుంచే అలవడింది). ఈ మంత్రాన్నే పలువురు, పూర్వం పలువిధాలుగా స్మరించారు.

అనాదిగా నారద మహాముని 'నారాయణ' అని పలుకుతూ, వూత పదంలాగ స్మరించారు. అదే ఆయనకు ఓం నమోనారాయణ - అనే నారాయణ మంత్రమయింది. కృతయుగంలో ప్రహ్లాదవరదుడైన నారసింహుని శరణని, ఆ నారసింహ మంత్రం పఠించి రసాతలంలో తన మనుమడు బలిచక్రవర్తితో స్థిరపడ్డాడు, ప్రహ్లాదుడు. త్రేతాయుగంలో శ్రీరామమంత్రం పఠించి, జానకీ వల్లభుడైన శ్రీరామచంద్రుని కరుణతో, స్వర్ణ లంకాధిపతి అయ్యాడు విభీషణుడు. ఆ విధంగా వారందరికీ ఆయా మంత్రాలు కలిగితే, నాకు మాత్రం ప్రత్యేకంగా శ్రీవేంకటేశ్వరుని మంత్రం దొరికింది.

పూర్వం చిన్ని బాలుడైన ధ్రువుడు "ఓం భగవతే వాసుదేవాయ" అనే మంత్రం పఠించి శ్రీహరి దయను సంపాదించి ధృవనక్షత్రమై జగద్విఖ్యాతుడైనాడు. ద్వాపరయుగంలో అర్జునుడు, అంగవించి (ఉత్సాహంతో) 'శ్రీకృష్ణా! యదుభూషణా!' అని శ్రీకృష్ణ మంత్రం పఠించిన విజయుడైనాడు. ఆ తరువాత శుకయోగీంద్రుడు విష్ణుమూర్తిని సేవించి సదా ఆయన గాథలు ఇతర భక్తులకు చెబుతూ తరించాడు. నేడు నాకు శ్రీవేంకటేశుని మంత్రము, వింగడమై(ప్రత్యేకంగా) దొరికింది.

పైన చెప్పిన ఇన్ని మంత్రాలకు లక్ష్యం లక్ష్మీకాంతుడైన శ్రీమన్నారాయణుడే. ఈ మంత్రమే పరబ్రహ్మ మంత్రంవలె, పన్నినది (నెలకొనినది). ఇకపో, నన్ను రక్షించుటకు మా గురుదేవులు నాకందించిన మంత్రమే "ఓం నమో వేంకటేశాయ" అనే అష్టాక్షరీ మంత్రం. అది వెన్నెల వలె చల్లనైనది. మీరూ శరణని నేటినుంచే మొదలు పెట్టండి. తరించండి.



Scanned with CamScanner